

మద్యం పర్మిట్ గదులు అపరిమితంగా మారుతున్నాయి. ఇంతింతై.. వటుడింతై అన్న చందంగా 10/10 సైజు నుంచి టూరింగ్ టాకీస్‌లంత పెద్దగా విస్తరించాయి. విచ్చల విడిగా ఏర్పాటు చేసిన ఆ గదుల్లో మంచింగ్ కోసం దొరకని వంటకం అంటూ ఉండదు. నాన్ వెజ్ వంటకాలతో పాటు పండ్లు కూడా కోసి ఇస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అక్కడ నిలబడి తాగడానికి మాత్రమే ఏర్పాట్లు చేయాల్సి ఉండగా.. కూర్చోవడానికి సదుపాయాలు కల్పిస్తున్నారు. నలుగురైదుగురు కలిసొస్తే సపరేట్ గదులను సిద్ధం చేస్తున్నారు. అందుకే చాలా మంది బార్‌లకు బదులు పర్మిట్ గదులకు వెళ్లడానికే మొగ్గు చూపుతున్నారు. విషయం తెలిసినా టార్గెట్ రీచ్ కావాలన్న ఉద్దేశంతో ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

- మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

పర్మిట్ అపరిమితం



జడ్చర్ల మండలం రాజాపూర్ వద్ద జాతీయ రహదారి పక్కన గల ఓ మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన విశాలమైన పర్మిట్ గది

- బార్‌లకు మించి వైన్స్‌ల పక్కన పర్మిట్ గదుల ఏర్పాటు
- అన్ని రకాల వంటకాలు నిమిషాల్లో వడ్డింపు
- ఎక్సైజ్‌శాఖ సహకారంతో నిబంధనలు ఉల్లంఘన
- మద్యం విక్రయాలు పెంచడమే లక్ష్యంగా అధికారుల ఉదాసీనత
- ఉమ్మడి జిల్లాలో 37 బార్లు.. 220 మద్యం దుకాణాలు
- ప్రతీ నెల రూ.225 కోట్ల విలువ గల మద్యం విక్రయాలు..

అయినా తీరని టార్గెట్ దాహం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మద్యం దుకాణాల వద్ద పర్మిట్ గదులను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇదివరకు మద్యం తాగాలంటే బార్‌లకు వెళ్లేవారు. ఆ తరువాత మద్యం దుకాణాల వద్ద పర్మిట్ గదుల ఏర్పాటుకు అనుమతించారు. అది కూడా వైన్స్ యజమానులు అడిగి, కొంత డబ్బు చెల్లిస్తే.. చిన్నపాటి పర్మిట్ గది(నిబంధనల ప్రకారం 10/10 అడుగులు) ఏర్పాటుకు ఓకే చెప్పేవారు. ఆ తరువాత మద్యం దుకాణాల వద్ద పర్మిట్ గదిని కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని, మద్యం లైసెన్స్ ఫీజుతోపాటు రూ.రెండు లక్షలు చెల్లించాలని నిబంధన ఉండటంతో అందరూ డబ్బులు కట్టి పర్మిట్ గదులను ఏర్పాటు చేసుకుంటున్నారు. మొదట్లో నిర్ణయించిన సైజుకన్నా కాస్త ఎక్కువగానే గదిని ఏర్పాటు చేసుకున్నారు. రానురాను బార్‌ల కన్నా పర్మిట్ గదులకు వచ్చే మందుబాబుల సంఖ్య ఎక్కువ కావడంతో నెమ్మదిగా గదిని పెంచడం ప్రారంభించారు. బార్‌లకు వెళ్తే ఖర్చు పెరుగుతుందని భావించి పర్మిట్ గదులకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. వారి అభిరుచి మేరకు అక్కడే అన్ని రకాల వంటకాలు వండి వారుస్తున్నారు. దాంతో పర్మిట్ గదులకు మరింత డిమాండ్ పెరిగింది.

అక్కడే అన్ని రకాల వంటకాలు

పర్మిట్ గదులంటే కూర్చోవడానికి సీటింగ్ ఉండకూడదు. టేబుల్ ఉంటే నిలబడి తాగి వెళ్లిపోవాలి. కానీ అందుకు విరుద్ధంగా టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల అయితే గ్యాంగ్‌లు కూర్చోడానికి సపరేట్ గదులను ఏర్పాటు చేశారు. అక్కడే చికెన్, మటన్, తలకాయ, బోటీ, ఫిష్ ఫ్రైలు, ఆమ్లేట్‌లను క్షణాల్లో మందుబాబులకు అందిస్తుంటారు. మిర్చీ, పల్లీ, శనగలు, అనుములు ఇలా ఏదికావాలన్నా పర్మిట్ గదుల వద్ద లభిస్తుండటంతో మందుబాబులు

(మిగతా 6లో..)

పదికి పదింతల సైజు

పర్మిట్ గదుల సైజు 10/10 అడుగులు కాస్త.. పదింతలు పెరిగిపోయింది. ఇప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎక్కడ చూసినా పర్మిట్ గదులు విస్తరించిపోయాయి. జాతీయ రహదారి వెంట ఉన్న వైన్స్‌లు హైవేకు కొంత దూరం లోపలికి ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనలు విధించడంతో అదే వారికి వరంగా మారింది. పెద్ద పెద్ద స్థలాలు లీజుకు తీసుకుని, తడకలతో పర్మిట్ గదులను విస్తరించారు. జిల్లా కేంద్రంలోనూ వైన్స్‌ల పక్కన భారీ సిట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. పర్మిట్ గదులను టూరింగ్ టాకీసుల మాదిరిగా మార్చారు. గద్వాల, నాగర్‌కర్నూల్, మండల కేంద్రాల్లో అంతటా ఇదే పరిస్థితి నెలకొంది.

వృథాగా గోదాం

- ఐదువేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ గోదాం
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు
- తాగుబోతులకు అడ్డాగా మారిన పరిసరాలు
- తుప్పు పట్టిన వే బ్రిడ్జి, నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని రాయపురం శివారులో నిరుపయోగంగా ఉన్న గోదాం

6

సాగు, తాగునీటి కోసం కర్ణాటక సీఎంను కలుస్తాం

వివరాలు వెల్లడించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీటి అవసరాల కోసం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు బుధవారం కర్ణాటక సీఎంను కలువనున్నట్లు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు రైతులు, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సాగు, తాగునీటి అవసరాల కోసం కృష్ణానదికి నీటిని విడుదల చేయాలని కోరేందుకు బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దిరామయ్యను కలువనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

సోషల్ మీడియా వ్యవసాయం



- సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్న యువ రైతులు 7
- వీడియోలు, పోస్టుల ద్వారా సాగులో మెళకువలు



అమ్మవారిని తీసుకువచ్చేందుకు సారెతో బయలుదేరిన ఆలయ చైర్మన్, ఈవో, డైరెక్టర్లు

నేడు మెట్టినింటికి జములమ్మ

- అమ్మవారిని తీసుకువచ్చేందుకు చీరాసారెతో గుర్రంగడ్డకు ఎద్దుల బండిలో బయలు దేరిన ఆలయ చైర్మన్
- జనసంద్రం అయిన ఆలయ పరిసరాలు
- బ్రహ్మోత్సవాలలో భక్తుల నిలువు దోపిడీ

6

అపార్ కార్డు కష్టాలు

- కొనసాగుతున్న 'అపార్' నమోదు ప్రక్రియ
- రాష్ట్రంలోనే వెనుకబడిన వనపర్తి జిల్లా



చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోమెటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ప్రక్రియతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీలో భాగంగా అపార్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. అపార్ ఐడీ ద్వారా విద్యార్థుల పురోగతిని పరిశీలించవచ్చు. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ కావాలన్న, పలు ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలన్న అపార్ ఐడీని ఉపయోగించుకోవచ్చు. భవిష్యత్తులో ఉన్నత చదువులు ఉద్యోగ దరఖాస్తులకు ఈ అపార్ కార్డు ఎంతో ఉపయోగపడుతోంది. నమోదు ప్రక్రియ మూడు నెలలపై నుంచి చేపడుతున్నప్పటికీ జిల్లాలో కేవలం 16 శాతమే పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా వనపర్తి పూర్తిగా వెనుకబడిపోయింది. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ అపార్ ఐడీ నమోదు చేయాలని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అపార్ నమోదుకు విద్యార్థుల ఆధార్ వివరాలతో పాటు తల్లి లేదా తండ్రి అనుమతి తప్పనిసరిగా ఉండాలి. యూడైస్‌లో ఇప్పటికే ఉన్న విద్యార్థుల పర్మినెంట్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ వివరాలు సక్రమంగా లేకపోవడంతో అపార్ నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పుట్టిన తేదీ, తల్లిదండ్రులు పిలుచుకునే పేర్లు ఒకలా ఉంటే.. ఆధార్‌లో మరోలా ఉండడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. వనపర్తి జిల్లాలో 15 మండలాల్లో 718 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా అందులో ఒకటి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 95,240 మంది ఉన్నారు. అపార్ నమోదులో ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 16 శాతమే పూర్తియింది. అంటే రాష్ట్రవ్యాప్తంగా వనపర్తి జిల్లా 32వ స్థానంలో నిలిచింది. జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేస్తే అపార్ నమోదులో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వనపర్తి జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం పేరు	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	అపార్‌లో నమోదైన సంఖ్య
వనపర్తి	161	29,821	1,421
పెబ్బేరు	71	8,644	734
శ్రీరంగాపురం	20	1,795	299
ఆత్మకూరు	42	9,758	1,052
అమరచింత	30	2,893	704
పాన్‌గల్	53	4,951	542
వీపనగండ్ల	29	1,755	205
గోపాల్‌పేట	43	4,283	641
రేవల్లి	16	1,580	402
ఏదుల	16	1,045	269
కొత్తకోట	76	12,884	3,322
మదనాపూర్	30	3,396	950
పెద్దమందడి	49	4,841	1,442
చిన్నంబావి	34	2,378	737
ఖిల్లాఘణపురం	48	5,216	1,892

అపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయాల్సిందే. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.



- అబ్దుల్ ఘని, ఇన్‌చార్జి డీఈవో

మెరుగైన వైద్యం అందించాలి



క్యాన్సర్ నుంచి కోలుకున్న సైదమ్మను సన్మానిస్తున్న కలెక్టర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా మంగళవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని కలెక్టర్ పరిశీలించారు. అసంక్రమిత వ్యాధిగ్రస్థులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. క్యాన్సర్ బారిన పడి కోలుకున్న సైదమ్మను కలెక్టర్ సన్మానించారు. క్యాన్సర్ నివారణ కోసం కృషి చేస్తున్న సిబ్బంది, నర్సులకు వైద్యాధికారులకు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రంగారావు, ఎన్‌సీడీ వైద్యులు రామచంద్ర, మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్యభగవానుడి కల్యాణం

- అఖండ భజనతో మార్మోగిన ఆలయ పరిసరాలు

తాడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని భలాన్‌పల్లిలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం వేద పండితులు ఛాయాదేవి, ఉషాదేవి సమేత సూర్యనారాయణస్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. కల్యాణోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అఖండ భజనతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సాయంత్రం స్వామి అమ్మవార్ల పల్లకీ సేవ నిర్వహించారు. బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఉంటాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.



సూర్యభగవానుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పర్మిట్.. అపరిమితం



జడ్చర్ల మండలం రాజాపూర్ వద్ద జాతీయ రహదారి పక్కన ఓ మద్యం దుకాణం వారు ఏర్పాటు చేసిన పెద్ద పర్మిట్ హాల్

(5వ పేజీ తరువాయి)

అక్కడికే వెళ్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఓ మద్యం దుకాణం పర్మిట్ గదిలో మద్యంలోకి పండ్లు కోసి విక్రయిస్తున్నారంటే పరిస్థితిని అర్థమవుతోంది. ఇదివరకు పర్మిట్ గదులకు వెళ్లాలంటే జంకేవాళ్లు సైతం అక్కడ అన్ని రకాల మర్యాదలు ఉండటంతో అక్కడికి వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారు.

టార్గెట్‌లే లక్ష్యంగా

పర్మిట్ గదులు నిబంధనలకు విరుద్ధంగా బార్‌లను మించిపోతున్నాయన్న విషయం ఎక్సైజ్‌శాఖకు తెలిసినా టార్గెట్‌లే లక్ష్యంగా వాటి జోలికి వెళ్లడం లేదు. ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా వైన్స్‌ల నుంచి పెద్దఎత్తున బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా అవుతున్నా, ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో 37 బార్లు, 230 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో వేల సంఖ్యలో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. గతేడాది ఉమ్మడి పాలమూరులో ఏకంగా రూ.2,700 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ప్రతీ నెల సగటున 2.30 లక్షల కేసుల లిక్కర్, 3.25 లక్షల కేసుల బీర్లు తాగుతున్నారు. నెలకు సగటున రూ.225 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నా ఇంకా టార్గెట్‌లు పెంచుతున్నారని ఓ ఎక్సైజ్ అధికారి తెలిపారు. వాళ్లకు ఆ స్థాయిలో టార్గెట్‌లు ఇస్తున్నందునే పర్మిట్ గదులు పెంచుకుంటున్నా, బెల్ట్ దుకాణాల సంఖ్య పెరుగుతున్నా ఆదాయమే లక్ష్యంగా వాటి జోలికి వెళ్లడం లేదన్నది బహిరంగ రహస్యం. చూసీచూడకుండా వదిలేయడంతోపాటు వారిని పరోక్షంగా ప్రోత్సహిస్తే ఆదాయం పెరగడంతోపాటు మద్యం దుకాణాల నుంచి ఎక్సైజ్ అధికారులకు ఖర్చులు వస్తున్నాయని, తద్వారా రెండువిధాల ప్రయోజనాలు చేకూరుతున్నాయని విమర్శలున్నాయి.

నారాయణపేటలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న రాజ్‌కుమార్‌రెడ్డి, భక్తులు

నారాయణపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాహేర్‌పేటలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన హనుమాన్, చౌడేశ్వరి మాత దేవాలయాల్లో రెండు శిఖరాల నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని, ఈ ఖర్చును భీష్మ ఫౌండేషన్ భరిస్తుందని ప్రకటించారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నదానంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు నర్సమ్మ రాము, వరలక్ష్మీకార్తీక్, వెంకటప్ప పాల్గొన్నారు.



మన్యంకొండ వేంకటేశ్వర స్వామి ఆలయం



రథానికి రంగులు వేస్తున్న కార్మికులు



సిద్ధమౌతున్న లడ్డూ ప్రసాదం

బ్రహ్మోత్సవం

- ఈనెల ఏడో తేదీ నుంచి మన్యంకొండ ఉత్సవాలు
- 12న రథోత్సవం
- అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మార్చి వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 12న రథోత్సవం ఉంటుంది. ఉత్సవాలను గతం కంటే అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ఆలయ కమిటీ సన్నాహాలు చేసింది.

బ్రహ్మోత్సవాల వివరాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల ఏడో తేదీన తిరుచ్చిసేవ నిర్వహించనున్నారు. ఎనిమిదిన హంస వాహన సేవ, తొమ్మిదిన గజవాహన సేవ, 10న సూర్యప్రభ వాహన సేవ, 11న ప్రభోత్సవం, హనుమ వాహన సేవ, 12న గరుడవాహన సేవ (తేరు)రథోత్సవం, 13న అశ్వవాహనసేవ, 14న శేషవాహన స్వామివారి దర్బారు సేవ, 26న మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయి. ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి 16 వరకు అలువేలు మంగతాయారు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం ఉండటంతో భక్తులు ఎక్కువగా వస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారి దర్శనానికి ఇనుప బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే తేరు మైదానంలో దిగువన దుకాణాలు వెలిశాయి. భక్తుల స్నానాలకు ఇబ్బందిలేకుండా షవర్లు, నల్లాలు ఏర్పాటు చేశారు. రూ.500తో భక్తులకు 28 గదులు సిద్ధం చేశారు. దాసంగం షెడ్డు, విశ్రాంతి షెడ్లు అందుబాటులోకి తెచ్చారు. ప్రసాదాల కౌంటర్‌ను కొండపైన కాకుండా తేరు ప్రాగణంలో నూతనంగా ఏర్పాటు చేశారు. జాతర సమయంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు.. జాతర ప్రాంగణంలో 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో రోజూ అన్నదానం చేయనున్నారు. భక్తులకు ఏవైన అనారోగ్య సమస్యలు వచ్చినా, ప్రమాదాలు జరిగినా అత్యవసర చికిత్స కోసం నాలుగు హెల్త్ సెంటర్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అలహరి మధుసూదన్ కుమార్, ఈవో శ్రీనివాసరాజు పేర్కొన్నారు.



వెలిసిన దుకాణాలు

కనుల పండువగా రథోత్సవం

- మద్వార్, కర్నిలో మారుమోగిన గోవింద నామస్మరణ
- దాసంగాలు సమర్పించిన భక్తులు



మాద్వార్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

మక్తల్‌రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా మక్తల్ మండలంలోని మాద్వార్ గట్టు తిమ్మప్ప, కర్ని గుంటి రంగస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గట్టు తిమ్మప్ప ఆలయం, గుంటి రంగస్వామి దేవాలయంలో సుప్రభాతం, శ్రీనివాస కల్యాణం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పిండివంటలతో స్వామివారికి నైవేద్యం, దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఉత్సవ మూర్తి విగ్రహానికి రథం వద్ద పూజలు నిర్వహించి భక్తుల చప్పట్లు, కోలాహలం, కేరింతల నడుమ గోవింద నామస్మరణతో రథాన్ని ముందుకు లాగారు. వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్‌పర్సన్ రాధమ్మ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, గ్రామ పెద్దలు, రాజేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, బాలరాజు, భాస్కర్‌రెడ్డి, గాసం శ్రీను, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్న రంగప్ప, పూజారులు సురందర్, సంతోష్‌రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి

కోస్గి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చిరుత దాడి చేయడంతో లేగ దూడ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి గుండుమాల్ మండల కేంద్రంలో చోటు చేసుకొంది. బాధితుడు గుడిసె కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం రోజూ మాదిరిగానే పశువులను పెద్దగుట్ట సమీపంలో ఉన్న తన పొలం దగ్గర కొట్టంలో కట్టేసి రాత్రి సమయంలో ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం పొలం వద్ద లేగదూడ చిరుత దాడిలో మృతి చెందినట్లు గుర్తించాడు. ఇంతకు ముందే ఆ ప్రాంతంలో చిరుత దాడిలో కుక్క మృతి చెందినట్లు రైతులు తెలిపారు. సాయంత్రం అయితే ఈ ప్రాంతంలో ఉన్న రైతులు బిక్కుబిక్కుమంటూ త్వరగా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇంత జరిగినా ఫారెస్టు అధికారులు ఇటువైపు రాలేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మెట్టినింటికి జములమ్మ



జములమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గద్వాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జములమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారి పుట్టినిల్లు అయిన గుర్రంగడ్డ నుంచి తీసుకరావడానికి మంగళవారం ఎద్దుల బండి వెళ్లింది. అంతకుముందు ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్ కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయం ప్రకారం దేవాలయం తరపున సారెను సిద్ధం చేసి అమ్మవారిని తీసుకువచ్చే నిర్వాహకులు భుజానఎత్తి భాజా భజంత్రీలతో ఎద్దుల బండి వరకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి జమ్మిచేడు, లత్తీపురం, బీరోలు మీదుగా గుర్రంగడ్డకు సాయంత్రం చేరారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం మరుసటి రోజు బుధవారం తెల్లవారుజామున జమ్మిచేడుకు తీసుకువస్తారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం పెద్ద ఎత్తున భక్తులు క్యూ కట్టారు. తెల్లవారుజామున నుంచి భక్తుల తాకిడి పెరిగింది. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బైనోళ్ల, కుర్వడోళ్ల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో జములమ్మను కొలిచారు. సాయంత్రం వరకు 50వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారని ఆలయ చైర్మన్ వెంకట్రాములు తెలిపారు. కాగా భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును నిర్వహించారు. జములమ్మ బ్రహ్మోత్సవాలలో భక్తులు నిలువు దోపిడీకి గురి అవుతున్నారు. టెండర్ దారుడు ఒక్కో టెంకాయను రూ.25లకు విక్రయించాల్సి ఉండగా జత రూ.100లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. సైజు చిన్నదిగా ఉండటంతో భక్తులు ఆగ్రహిస్తున్నారు. అదేవిధంగా టెంకాయలు కొట్టేదగ్గర లాక్కొని కొట్టి రూ.10ల నుంచి రూ.20లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఘనంగా రథసప్తమి వేడుకలు



అలంపూరులో సూర్యనారాయణస్వామిని ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అలంపూరు పట్టణంలో వెలసిన సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని, పూజలు చేశారు.

పుల్లూరులో...

ఉండవల్లి మండలంలోని పుల్లూరు గ్రామంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సూర్యనారాయణస్వామి ఆలయంలో ఏటా రథసప్తమి రోజున ఉదయం భానుడి కిరణాలు స్వామి వారి పాదాలను తాకుతాయని గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ఆచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

వృథాగా గోదాం



నిరుపయోగంగా ఉన్న టాన్స్‌ఫార్మర్

గట్టు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన గోదాం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వం నాబార్డు నిధులతో జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని రాయపురం శివారులో ఐదు వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో వ్యవసాయ మార్కెట్ గోదాం నిర్మించారు. ఈ గోదాంలో మిల్లర్లు, ట్రేడర్స్, ధాన్యం నిల్వ చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ గోదాం పర్యవేక్షణ మార్కెటింగ్ శాఖ పరిధిలో ఉంటుంది. వీటిని అద్దెకు ఇవ్వొచ్చు. కానీ నిర్మించినప్పటి నుంచి నేటి వరకు వినియోగించుకున్న దాఖలాలు లేవు.

ఈ గోదాంలో ఇప్పటివరకు నిల్వలు చేసుకోవడానికి మిల్లర్లు, ట్రేడర్స్ ముందుకు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఏదైతే లక్ష్యంతో నిర్మించారో అది నెరవేరలేదు. ఈ గోదాములు ఎందుకు నిర్మించారో? ఎందుకు వృథాగా వదలి వేశారో అర్థం కావడం లేదు. గోదాం దగ్గర ఏర్పాటు చేసిన వే బ్రిడ్జి తుప్పుపట్టి పాడైపోయింది. గోదాం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. ఈ గోదాంకు ఉన్న షెట్టర్లకు, ఇనుప గేట్లకు తాళాలు వేయకపోవడంతో నిత్యం గొర్రెలు, బర్రెలు, మేకలు చేరి సేద తీరుతుంటాయి. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ గోదాం వృథాగా ఉండటంతో ప్రజాధనం వృథా చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

అంతేకాకుండా గద్వాల నుంచి గట్టుకు వెళ్లే ప్రధాన రోడ్డు సమీపంలో ఈ గోదాం ఉండటంతో తాగుబోతులు అడ్డాగా మార్చుకున్నారు. గోదాం పరిసరాలు మద్యం బాటిళ్లతో నిండిపోయాయి. సంబంధిత శాఖ అధికారులు శ్రద్ధ తీసుకిన వృథాగా ఉన్న ఈ గోదాంను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



తుప్పుపట్టి పోయిన వేబ్రిడ్జి

వీఎస్‌టీ కంపెనీకి అద్దెకు ఇవ్వాలి



వృథాగా ఉన్న గోదాంను ఇటీవల వీఎస్‌టీ కంపెనీ వారు తమ పొగాకు నిల్వల కోసం అద్దెకు తీసుకునేందుకు ముందుకు వచ్చారు. గోదాం పరిసరాలన్నీ శుభ్రం చేసి, విద్యుత్ సరఫరా పనులు చేయిస్తున్నాం. చిన్నచిన్న మరమ్మతులు చేయించి వారికి అద్దెకు ఇస్తాం.

\- పుష్పమ్మ, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారిణి

అంగరంగ వైభవంగా ఈదమ్మ జాతర

- సిడె ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న జూపల్లి అరుణ్

పాన్‌గల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ఈదమ్మ జాతరలో భాగంగా మంగళవారం నిర్వహించిన సిడె ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. సిడె కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సమీప గ్రామాల ప్రజలు బోనాలు నెత్తిన పెట్టుకొని ఈదమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈదమ్మ తల్లిని జూపల్లి అరుణ్ దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజారి కుమ్మరి నాగన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సిడెకు పొట్టేలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వనపర్తి సీఐ కృష్ణ నేతృత్వంలో ఆరుగురు ఎస్‌ఐలు, 70 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, కేతేపల్లి రవి, వెంకటేష్ నాయుడు, పుల్లారావు రాము, భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సిడె కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తి అరెస్టు

- బాధితుల ఫిర్యాదు ఆధారంగా విచారణ చేస్తాం : డీఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కల్వకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రూపాయి పెట్టుబడి పెడితే రెండు రూపాయలు లాభం వస్తుందని మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న ముజామీల్‌ను అరెస్టు చేసినట్లు కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కల్వకుర్తి పట్టణంలోని ఓ మసీదులో ప్రార్థన సమయంలో మసీదుకు వచ్చేవారితో మమేకమై రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మబలికాడు. 2020 సంవత్సరం నుంచి 2023 వరకు రూ.90కోట్లు వసూలు చేసి రూ. 50 కోట్ల వరకు తిరిగి ఇచ్చాడు. ముజామీల్ రూ.14కోట్లు పెట్టుబడి పెట్టిన వ్యక్తి మరణించడంతో పెట్టుబడి తిరిగి చెల్లించలేక ఇబ్బంది అయ్యిందని, దీంతో ప్రజలు తిరుగుబాటు చేశారని తెలిపారు. అధిక లాభం చూయించి మోసం చేస్తున్న ముజామీల్‌ను మహేశ్వరం గ్రామంలో అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అతనిపై ఇదివరకే రెండు కేసులు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురంలో మరో కేసు నమోదైందని, కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో 41ఏసీఆర్‌సీ సెక్షన్ కింద నోటీసు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని చెక్కులు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని, బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగిస్తున్నామని తెలిపారు. అనంతరం కస్టడీలోకి తీసుకుని ఆస్తులతో పాటు పూర్తి లావాదేవీలపై విచారణ చేసి వివరాలు కోర్టులో అందజేస్తామని తెలిపారు. విలేకర్ల సమావేశంలో సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డిలు ఉన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



టీకే లక్ష్మాపూర్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

అమ్రాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం అమ్రాబాద్ మండలంలోని టీకేలక్ష్మాపూర్‌లో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించి నిర్ధారణ అయితే వారికి మందులు ఉచితంగా అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తారాసింగ్, ప్రోగ్రాం అధికారి రాజశేఖర్, తహసీల్దార్ శైలేంద్రకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

» మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



విజేతలైన విద్యార్థులతో డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆత్మరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్కే స్పోర్ట్స్ కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎంపీ-2025 కరాటే పోటీలు నిర్వహించారు. బ్లాక్ బెల్టు విభాగంలో వర్షిణి, బ్రౌన్ బెల్టు విభాగంలో నవ్య, కలర్ బెల్టులో ఆరాధ్య, వినూత్న గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించారు. బాలుర విభాగంలో బ్రౌన్ బెల్టు కేటగిరిలో రేవంత్, గణేష్, వైట్ బెల్టు విభాగంలో రితిక్ గ్రాండ్ చాంపియన్లుగా నిలిచారు. వారిని మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు. రాష్ట్ర స్థాయి టోర్నీలో విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ చాటడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అకాడమీ ఫౌండర్ రవికుమార్, అడ్వయిజర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరున సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా పురుషుల జట్టు ఎంపికలను ఈనెల ఆరున నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు రాఘవేందర్, నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వరంగల్ జిల్లాకేంద్రంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు మధ్యాహ్నం మూడు గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొన్న కారు

» ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు



పుష్పలత (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు డివైడర్‌ను కారు ఢీకొని ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా, చందుపట్ల శివారులో మంగళవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి... పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన ఎదిరి భాస్కర్, పుష్పలత (47) దంపతులు కుమార్తె భవానీతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో ఒక శుభకార్యానికి వెళ్లి కారులో స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. నాగర్‌కర్నూల్ మండల శివారులోని చందుపట్ల సమీపంలో ప్రమాదవశాత్తు వారు వస్తున్న కారు డివైడర్‌ను ఢీకొన్నది. ఈ సంఘటనలో పుష్పలత అక్కడికక్కడే మృతి చెందింది. భాస్కర్‌కు, అతడి కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. వారి కుమారుడు రాఘవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి... నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన కొండపల్లి ఎల్లయ్య(58) సోమవారం రాత్రి బాత్రూంలో బల్బు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సంఘటనపై అతడి కుమారుడు వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

» నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో ఘటనలు

పెంట్లవెల్లి/ ఉట్కూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లోని రెండు ఆలయాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం గోప్లాపూర్ గ్రామంలోని జములమ్మ, పోచమ్మ గుడి తలుపులకు వేసిన తాళం పగులగొట్టిన దొంగలు, అమ్మవార్ల బంగారు మంగళ సూత్రాలు, కాలిమెట్టెలు ఎత్తుకెళ్లారు. వాటి విలువ లక్ష రూపాయలు ఉంటుందని రైతు కమిటీ గ్రామ అధ్యక్షుడు టి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు చేయ గా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

- నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండల కేంద్రంలోని ఊర లక్ష్మమ్మ దేవాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. హుండీతో పాటు, ఇత్తడి దీపాలు, హారతి పళ్లెం, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన భక్తులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు హన్మంతు, భరత్, వీహెచ్‌పీ నాయకులు వెంకట్‌నారాయణ, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యం


నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తూడుకుర్తి గ్రామానికి చెందిన చింతలపల్లి చందన (20) అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తూడుకుర్తి గ్రామానికి చెందిన చందన సోమవారం ఇంట్లో వారికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తల్లి చింతలపల్లి మండెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టపగలు నాలుగు లక్షలు చోరీ

నారాయణపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట పట్టణంలోని మెయిన్‌చౌక్‌లో మంగళవారం పట్టపగలు చోరీ జరిగింది. దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామానికి చెందిన నారాయణ మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చాడు. ఆంధ్ర బ్యాంకులో నాలుగు లక్షల రూపాయలు డ్రా చేసుకున్నాడు. డబ్బు ఉంచి బ్యాగ్‌ను బండి హ్యాండిల్‌కు తగిలించుకున్నాడు. పట్టణంలోని మెయిన్‌చౌక్‌లో వాహనాన్ని ఆపి, పక్కనే ఉన్న బేకరీకి వెళ్లారు. అదే సమయంలో బైక్‌కు తగిలించి ఉన్న బ్యాగ్‌ను ఓ యువకుడు ఎత్తుకెళ్లిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చోరీ సంఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది.

అడవి పంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అడవి పంది దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం, మొలచింతలపల్లి గ్రామానికి చెందిన టప్ప వెంకటస్వామి (50) గ్రామ సమీపంలోని తన ఎనిమిది ఎకరాల పొలంలో సాగు చేసిన మినుముల పంటకు నీళ్లు పెట్టేందుకు సోమవారం రాత్రి పొలానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం పొలం వద్ద ఉన్న భర్తకు భార్య నాగలక్ష్మి టిఫిన్ తీసుకెళ్లింది. అక్కడ ఇద్దరు కలిసి పని చేస్తుండగా, గుంపులు గుంపులుగా నెమళ్లు వచ్చాయి. వాటిని చెదరగొడుతుండగా పక్కనే ఉన్న పొదల్లో నుంచి అడవి పంది వచ్చి వెంకటస్వామిపై దాడి చేయడంతో, మెడ, కుడి చేయి, కడుపుపై తీవ్ర గాయాలయ్యాయి. భార్య నాగలక్ష్మి పెద్దగా కేకలు వేయడంతో ఆ పంది ఆమెపైనా దాడికి యత్నించింది. ఆమె మరింత పెద్దగా కేకలు వేయడంతో పారిపోయింది. గాయపడిన వెంకటస్వామిని అంబులెన్స్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





ఏపుగా కాసిన కాకర కాయలను చూపిస్తున్న రైతు బోల రవికుమార్, శేరిపల్లి సమీపంలో రైతు కె.బాలరాజు సాగు చేసిన బెండ తోట



సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్న యువ రైతులు

» వీడియోలు, పోస్టుల ద్వారా సాగులో మెళకువలు

» ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగుతో అధిక దిగుబడులు

భూత్పూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా యువ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని హస్నాపూర్, పోతులమడుగు, శేరిపల్లి (హెచ్), కొత్తమొల్గర, పాత మొల్గర, కప్పెట, అన్నాసాగర్, రావులపల్లి, తాటికొండ తదితర గ్రామాకు చెందిన యువ రైతులు సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. పంటల సాగులో కొత్త పుంతలు తొక్కుతున్నారు. ప్రధానంగా కూరగాయల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఆధునిక పద్ధతులు ఏవి? అధిక దిగుబడులు ఎలా సాధించాలి? ఏ సీజన్లో ఏ కూరగాయలు పండించాలి? ఏ కాలంలో విత్తనాలు వేసుకోవాలి, పంట వివిధ దశల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలేంటి? సాగులో యంత్రాల వినియోగం ఎలా? మార్కెట్లో వేటికి డిమాండ్ ఉంటుంది? తదితర విషయాలను యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని ఆచరణలో పెడుతున్నారు. అధిక దిగుబడులను సాధిస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు.

వీడియోలు, పోస్టుల ద్వారా కొత్త విషయాలు

వివిధ రాష్ట్రాల్లో రైతులు తాము సాగు చేస్తున్న కూరగాయలు, ఇతర పంటలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్ వీడియోలు, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతున్నారు. వాటిని ఫాలో అవుతూ భూత్పూర్ మండల రైతులు కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు. తమకు అవసరమైన సమాచారాన్ని వెతికి సేకరించుకుంటున్నారు. వాటిపై అవగాహన తెచ్చుకొని ఆచరణలో పెడుతున్నారు. కూరగాయల సాగుపైనే ఎక్కువ మంది రైతులు దృష్టి సారిస్తున్నారు. వాటి సాగు పద్ధతులను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుంటున్నారు. పందిరి సాగు పద్ధతులను స్మార్ట్ ఫోన్‌లలో వీడియోలు చూసి ఆచరణలో పెడుతున్నారు.

ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం

వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని కూడా తెలుసుకుంటున్నారు. కలుపుతీసే యంత్రాలు, క్రిమి సంహారక మందులు చల్లే డ్రోన్లు, ఒక మనిషి సులువుగా వినియోగించే పొలం దున్నేవి, పంటలు కోసే యంత్రాల గురించి తెలుసుకుంటున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి, మన రాష్ట్రంలోని మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు ఎక్కువగా కొత్త కొత్త యంత్రాలను వినియోగిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఆ విషయాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని తామూ వినియోగిస్తున్నట్లు రైతులు చెప్తున్నారు. వారిలో కొందరి అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి' సేకరించింది. ఆ వివరాలు...

కొత్త విషయాలు తెలుసుకోవచ్చు



నేను చాలా కాలంగా సోషల్ మీడియాను ఫాలో అవుతూ పంటల సాగులో కొత్త విషయాలు తెలుసుకుంటున్నాను. ఆరు సంవత్సరాల క్రితం బ్రకోలీ, క్యాలీఫ్లవర్, బంతిపూల సాగు పద్ధతలను యూట్యూబ్ ద్వారా తెలుసుకున్నాను. ఆయా పంటలను సాగు చేసిన రైతుల వివరాలు, ఫోన్ నెంబర్లను తెలుసుకొని వివరాలు తెలుసుకొని నేను కూడా పండించాను. గ్రాఫ్టింగ్ పద్ధతిలో టమాటా సాగు చేస్తున్నాను. మరో రెండు నెలల్లో పంట దిగుబడి వస్తుంది. అలాగే మొదట్లో అరటి తోటను పెంచాను. కానీ మన దగ్గర మార్కెట్ సౌకర్యం లేక మానేశాను. బ్రకోలీ, క్యాలీఫ్లవర్ సాగుతో మంచి దిగుబడులు సాధించాను. ఆదాయం కూడా బాగానే వచ్చింది. వ్యవసాయ, ఉద్యాన వన శాఖల ద్వారా రాయితీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు తీసుకున్నాను. మిర్చి, టమాటా, బెండ, చిక్కుడు, క్యాబేజీ, వంకాయ తదితర కూరగాయలు పండిస్తున్నాను.

- వీరస్వామి, రైతు, శేరిపల్లి

వీడియోలు చూసి పంటల సాగు



వ్యవసాయంలో స్మార్ట్ ఫోన్ బాగా ఉపయోగపడుతోంది. లాభాలు వచ్చే పంటల వివరాలు, సాగు పద్ధతులను యూట్యూబ్ వీడియోలు చూసి తెలుసుకుంటున్నాను. అలాగే మునగ సాగు పద్ధతులను వీడియోల ద్వారానే తెలుసుకొని సాగు చేశాను. సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యల వివరాలు కూడా తెలుసుకున్నాను. అలాగే పాడి గేదెల పెంపకం, అధిక పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి వీడియోలను చూసి ఆచరిస్తున్నాను. సమయానికి వ్యవసాయ అధికారులు అందుబాటులో లేకున్నా, యూట్యూబ్‌లో వీడియోలు చూసి సాగులో సమస్యలను పరిష్కరించుకోవచ్చు. కొంచెం ప్రయత్నిస్తే ఎవరైనా వారికి కావలసిన వీడియోలను వెతికి చూసుకోవచ్చు.

- బురాన్, రైతు, హస్నాపూర్

తెలియక ఇబ్బంది పడ్డాను



వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తెలియక మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. నేను అందరి లాగా సాధారణ పంటలను సాగు చేసేవాడిని. నాలుగు సంవత్సరాల క్రితం మా పక్క పొలం రైతు పందిరి పద్ధతిలో కాకర సాగు చేసి మంచి దిగుబడి సాధించాడు. అతడిని అడిగితే తాను యూట్యూబ్ వీడియోల ద్వారా తెలుసుకొని సాగు చేసినట్లు చెప్పాడు. నేను కూడా ఫోన్‌లో వివిధ రకాల పంటల వీడియోలు చూస్తూ, అవి సాగు చేసిన రైతుల ఫోన్ నెంబర్లు తీసుకొని వారితో మాట్లాడాను. వారి సూచనలు, సలహాలతో కాకర, బెండ, ఉల్లి, టమాటా, ఆకు కూరగాయాలు సాగు చేస్తున్నాను. దిగుబడులు కూడా మంచిగా వస్తున్నాయి.

- కుమ్మరి రాములు, రైతు, పోతులమడుగు

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు

» నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతం

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వరకట్న వేధింపులతో భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు న్యాయాధికారి జైలు శిక్ష విధించినట్లు నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదగిరి జిల్లా కర్ణాటక రాష్ట్రా నికి చెందిన మహేష్‌కుమార్‌కు, నారాయణ పేట మండలంలోని సింగారం గ్రామానికి చెందిన భవానీకి 2022, మే నెలలో వివాహం అయ్యింది. మూడు నెలల పాటు దంపతులు బాగానే ఉన్నారు. ఆ తర్వాత భవానీని భర్త, అతడి తండ్రి నారాయణ, తల్లి పార్వతమ్మలు రెండు లక్షలు అదనపు కట్నం తేవాలని, వంట పని, ఇంటి పని సరిగా రాదని వేధించారు. ఈ విషయాన్ని అన్న భరత్‌కుమార్‌కు తెలపడంతో అతడు ఆమెను స్వగ్రామానికి తీసుకొచ్చారు. పెద్దలసమక్షంలో పంచాయతీ పెట్టినా అత్తింటి వారిలో మార్పు రాలేదు. 2023, మే 31న భర్త, అత్తామామలు వారి ఇంటికి వచ్చారు. అదనపు కట్నం తీసుకురావాల్సిందేనని, లేకపోతే చావాలని బెదిరించి వెళ్లిపోయారు. ఆదే రోజు రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోయాక భవానీ చీరతో ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నది.

ఈ విషయంపై అన్న భరత్‌కుమార్ ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ సురేశ్ కుమార్ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ సత్యనారాయణ విచారణ పూర్తి చేసి, కోర్టులో చార్జిషీటు వేశారు. ప్రస్తుత డీఎస్పీ లింగయ్య ఉత్తర్వుల మేరకు సీఐ శివ కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కోర్టు లైజనింగ్ అధికారి, ఎస్‌ఐ బి.కృష్ణయ్యగౌడ్, కోర్టు డ్యూటీ అధికారులు పీసీ విజయకుమార్, హెచ్‌జీ మీర్జా బేగ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ ఆకుల బాలప్ప వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరం నిర్ధారణ కావడంతో పదేళ్ళ జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ మంగళవారం తీర్పు వెల్లడించారు. నేరస్తుడికి శిక్షపడేలా వ్యవహరించిన పోలీసులు, కోర్టు అధికారులను ఎస్పీ యోగేశ్‌గౌతం అభినందించారు. వారికి త్వరలో రివార్డు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న జాన్‌వెస్లీ

అమరచింత, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసే కార్యకర్తలకు అండగా ఉంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అమరచింతకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకుడు దేవస్వామి సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జాన్‌వెస్లీ మంగళవారం అమరచింతలోని ఆయన స్వగృహానికి చేరుకున్నారు. దేవస్వామి పార్థివదేహానికి నాయకులు జబ్బార్, మహమూద్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. దేవ స్వామి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో నాయకులు జీఎస్ గోపి, రమేష్, బుచ్చన్న, అజయ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

భూ సేకరణ, సర్వే పనుల అడ్డగింత

» బాపూర్ గ్రామస్థుల ఆందోళన » వెనుదిరిగిన అధికారుల బృందం



గ్రామస్థులు అడ్డుకోవడంతో సర్వేను నిలిపివేసిన అధికారులు

ఊట్కూర్/దామరగిద్ద, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూర్ మండలం బాపూర్ వద్ద అధికారులు చేపట్టిన సర్వేను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామం వద్ద పంప్‌హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులు 20 ఎకరాల భూమిని గుర్తించారు. ఆర్డీవో ఆదేశంతో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు మంగళవారం ఉదయం అక్కడికి వెళ్లారు. తహసీల్దార్ రవితో గ్రామ సమీపంలో భూమి సర్వే చేపట్టేందుకు సిద్ధం కాగా, గ్రామస్థులు అడ్డుకున్నారు. తమకు అర్ధ, ఎకరం, రెండు ఎకరాల భూమే ఉందని తెలిపారు. ఆ భూమిని ఇచ్చేందుకు తాము సిద్ధంగా లేమని, సర్వేను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీంతో తహసీల్దార్ రవి వారితో మాట్లాడారు. సర్వే చేయొద్దనడం సరికాదని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పండి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారికి తెలిపారు. దీంతో గ్రామస్థులు శాంతించడంతో అధికారులు సర్వే ప్రారంభించారు.

మధ్యాహ్నం వరకు 12 ఎకరాల భూమిని సర్వే చేసిన అధికారులు. మళ్లీ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో సర్వే పనులు మొదలు పెట్టగానే జడ్పీటీసీ మాజీ సభ్యుడు అశోక్‌కుమార్ గౌడ్‌తో కలిసి వచ్చిన రైతులు వారిని అడ్డుకున్నారు. రైతులతో మాట్లాడకుండా, వారికి సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న రైతు లతో మాట్లాడిన తర్వాతే సర్వే చేపట్టాలంటూ వాదనకు దిగారు. భూమి ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరు కాబట్టి, ప్రభుత్వ భూమి ఉన్న చోట ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అధికారులు ఎంత నచ్చజెప్పినా వారు వినకపోవడంతో సర్వేను నిలిపివేసి వెళ్లిపోయారు. సర్వేలో ఆర్‌ఐలు వెంకటేష్, కృష్ణారెడ్డి, ఇరిగేషన్ అధికారులు వెంకటప్ప, విజయ్‌కుమార్, సర్వే అధి కారి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇదే ఎత్తిపోతల పథకానికి సంబంధించి నారాయణపేట మండలం, పేరపళ్ల శివారులోని జయమ్మ చెరువు వద్ద పంప్‌హౌస్ నిర్మించనున్నారు. అక్కడికి యంత్రాలు, వాహనాలు వెళ్లేందుకు వీలుగా దామరగిద్ద నుంచి చెరువు వరకు ఉన్న రోడ్డు విస్తరణ పనులను మంగళవారం ప్రారంభించారు. పంప్‌హౌస్‌తో పాటు, విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి దామరగిద్ద మండలంలోని బాపన్‌పల్లి శివారులో ఇరిగేషన్ డీఈ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు భూమిని సర్వే చేశారు. జయమ్మ చెరువు పంప్ హౌస్ నుంచి కానుకుర్తి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోస్తారని, అక్కడి నుంచి కాలువల ద్వారా కొడంగల్ ప్రాంతానికి సాగునీరు అందించనున్నారని అధికారులు తెలిపారు.

పోస్టర్ రూపకల్పనలో గద్వాల విద్యార్థిని ప్రతిభ

» 'ఉలో - కాన్వథాన్' పేరుతో ఆన్‌లైన్‌లో పోటీ » లక్ష్మీ ప్రణీతకు ప్రథమ స్థానం

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పోస్టర్ రూపకల్పనలో గద్వాల విద్యార్థిని లక్ష్మీ ప్రణీత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానానికి ఎంపికయ్యింది. న్యూ ఢిల్లీ కేంద్రంగా ఉలో (యూ ఓన్లీ లైవ్ వన్స్) సంస్థ కాన్వథాన్-2024 పేరుతో పోస్టర్ డిజైనింగ్ పోటీ నిర్వహించింది. ఈ పోటీలో గద్వాల పట్టణంలోని అక్షర కాన్సెప్ట్ ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థిని పాల్గొన్నది. పరిశుభ్రత, పర్యావరణ కాలుష్యం, ప్లాస్టిక్ రహిత సమాజం తదితర అంశాలపై ఆమె పోస్టర్‌ను రూపొందించింది. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఈ పోటీలో ఆమె రూపొందించిన పోస్టర్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం లభించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీధర్, డైరెక్టర్ హరిత, ప్రిన్సిపాల్ రత్నంలు విద్యార్థినిని మంగళవారం ఆమెను అభినందించారు.





విద్యార్థిని లక్ష్మీ ప్రణీత, ఆమె రూపొందించిన పోస్టర్

న్యూస్ బాక్స్

ప్రమాదవశాత్తు బాలుడి మృతి


స్వామి (ఫైల్)

అమ్రాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఆరో తరగతి చదివే వాసస్వామి (13) అనే బాలుడు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండగా వాసస్వామి ఇంట్లోనే చీరతో ఏర్పాటు చేసిన ఉయ్యాల ఊగుతూ మెడకు చుట్టుకొని ఊపిరాడక మృతి చెందినట్లు కటుంబీకులు తెలిపారు. బాలుడి ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పట్టణాభివృద్ధికి కృషి

- మునిసిపల్ కమిషనర్ యాదయ్య

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణాభివృద్ధి కోసం కృషి చేస్తానని మునిసిపల్ కమిషనర్ యాదయ్య అన్నారు. అచ్చంపేట మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాసులుతో పాటు సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో సిబ్బంది ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. కాలనీలలో ఉన్న ప్రధాన సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సిబ్బంది తిరుపతయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

ఎన్‌డీడీపై పర్యవేక్షణకు శిక్షణ

కందనూలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళిక ప్రకారం ఫిబ్రవరి 10వ తేదీ వరకు జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలుపర్చాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ.స్వరాజ్యలక్ష్మి పర్యవేక్షకులను ఆదేశించారు. అన్ని మండల కేంద్రాల్లో ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు సమన్వయ సమావేశం నిర్వహించి నులిపురుగుల సంక్రమణ, నష్టాలు, నివారణ, అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి శిక్షణ ఇవ్వాలన్నారు. హెల్మింథీస్ వర్గానికి చెందిన ఏలికపాములు, కొంకి పురుగుల జీవిత చక్రం, సంక్రమణ, పిల్లల్లో కలిగే పోషకాహార లోపాలు, ముఖ్యంగా రక్తహీనత, కడుపునొప్పి, తదితర సమస్యల గురించి పర్యవేక్షకులకు దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీకీకరణ అధికారి డాక్టర్ రవికుమార్, హెచ్‌ఈవో విజయ్ కుమార్, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

మీ శుభకార్యాలకు మా బస్సులు వాడండి

- భారీ తగ్గింపు ధరతో ఇస్తామన్న ఆర్టీసీ డీఎం

కొల్లాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మీ ఊళ్లలో జరిగే శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులను భారీ తగ్గింపు ధరలకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించామని డిపోమేనేజర్ ఉమాశంకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కిలోమీటర్‌పై ఏడు రూపాయల వరకు తగ్గింపుతో పెళ్లిళ్లకు, శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తామని తెలిపారు. మాఘమాసం ప్రారంభమైనందున శుభకార్యాలు అధికంగా ఉటాయని తెలిపారు. కిలో మీటర్‌పై ఏడు రూపాయల తగ్గింపుతో పాటు గతంలో ఉన్న ఆరు గంటల వెయిటింగ్ చార్జీని రద్దు చేస్తూ డ్రైవర్‌కు ఎటువంటి బత్తా డబ్బులు చెల్లించకుండానే బస్సులను ఇస్తామని ఆయన తెలిపారు. అద్దెకు బస్సులను తీసుకోదలచిన వారు 9392046433, 9490521165 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని వారు తెలిపారు. డిపో పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తికి గాయాలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం సమీపంలో ఉన్న కల్వర్టును బైక్ అదుపుతప్పి ఢీకొన్న ఘటనలో బైక్‌పై ఉన్న మండలి వెంకటస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన వెంకటస్వామి నాగర్‌కర్నూల్ నుంచి బైక్‌పై వస్తుండగా పాలెంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం సమీపంలో ప్రధాన రహదారిలోని కల్వర్ట్‌కు బైక్ అదుపుతప్పి వేగంగా ఢీకొట్టాడు. బైక్‌పై నుంచి ఎగిరి కల్వర్టులో పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే కిందిని పైకి తీసుకొచ్చి 108కు సమాచారం ఇచ్చి చికిత్స కోసం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో వ్యక్తికి ఒకరోజు జైలు

తెలకపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సోమవారం సాయంత్రం లింగాల రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎండి. ఆరీఫ్(25)కార్వంగకు చెందిన వ్యక్తి. మద్యం తాగి బైక్ నడుపుతుండగా పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. మంగళవారం అతనిని కోర్టులో హాజరు పర్చగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రూ.2వేలు జరిమానా, ఒకరోజు జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ఫిర్యాదు చేయడానికి వస్తే దాడి చేశారని బాధితుల ఆందోళన

కల్వకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన తమపై దాడి చేశారని ఆంజనేయులు, వెంకటేష్, నిరంజన్ సోమవారం తెలిపారు. కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన పలువురు, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ వారితో మాట్లాడి సర్దిచెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలు కుటుంబ సభ్యుల కథనం మేరకు కుర్మిద్ద గ్రామంలో పందుల విషయంలో జరిగిన గొడవపై ఫిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు దాడి చేశారని పేర్కొన్నారు.

పాలెం వెంకన్న సన్నిధిలో భక్తుల

తులాభారం

- పోటెత్తిన భక్తజనం

- భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు


పాలెం వెంకన్న స్వామి ఆలయంలో తులాభారం సమర్పిస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి

బిజినేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తులాభారం సమర్పించారు. పలువురు భక్తులు కూడా స్వామి వారికి తమ ఎత్తు బంగారాన్ని (పటిక బెల్లం) తులాభారం ద్వారా సమర్పించి ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథసప్తమి కావడంతో ఆలయంలో అలువేలు మంగసమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అలాగే రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని వందలాది భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత చేపట్టనున్న రథోత్సవానికి (తేరు) ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, ఆలయ కార్యానిర్వహణ అధికారి చిలుకూరు రంగారావులు తెలిపారు. తులాభారంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఆలయ కమిటీ సభ్యులు గాడి సురేందర్, సొప్పరి బాలస్వామి, కురుమయ్య, మాజీ వార్డు మెంబర్ ఐల రవీందర్‌రెడ్డి, కొంకలి మధు, శ్రీనివాసులు, నరసింహ, నవీన్ ఉన్నారు.

రూ.2.50 లక్షలతో లైట్ల ఏర్పాటు

మండలంలోని పాలెం గ్రామానికి చెందిన వర్కాల శ్రీరాములు అనే భక్తుడు తన భార్య జయప్రద జ్ఞాపకార్థం రూ.2.50 లక్షల విలువైన లైట్లను ఆలయానికి మంగళవారం అందజేసినట్లు ఈవో రంగారావు తెలిపారు. అంతకు ముందు స్వామి వారికి రూ.5 లక్షల విలువైన వెండి కిరీటం, కర్ణాభరణం, సూర్యకటారి, అమ్మవారికి వెండి కిరీటం, కర్ణ ఆభరణాలు అందజేసి భక్తి చాటుకున్నారని ఈవో అన్నారు. శ్రీరాములు కుటుంబ సభ్యులను ప్రధాన అర్చకులు ఆశీర్వదించారు.

భక్తిశ్రద్ధలతో సూర్యభగవానుడికి అభిషేకం


అభిషేకాలు, సూర్య హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

కందనూలు/ అచ్చంపేటటౌన్/ వంగూరు/ ఉప్పునుంతల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో సీతారామచంద్ర స్వామి దేవాలయంలో రథసప్తమి సందర్భంగా మంగళవారం సూర్యభగవానుడికి పంచామృత అభిషేకాలు, సూర్యహోమాలు నిర్వహించారు. రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరద రాజన్ అయ్యంగార్ ఆధ్వర్యంలో అర్చకులు వివిధపూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయ కమిటీ సభ్యులు అర్థం రవీందర్, మల్లేష్, గొల్ల రాములు, మన్యపురెడ్డి, కరుణశ్రీ, శారద, నందకిశోర్, శ్రీని వాసులు, రమాదేవి, నిర్మల, భక్తులుపాల్గొన్నారు.

-అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబికా ఆలయంలో ఆలయ అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయ్‌భాస్కర్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికంగా వచ్చి పూజలు నిర్వహించారు.

- వంగూరు మండలం గాజరలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అదే విధంగా రంగాపూర్ తండాలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి.

- ఉప్పునుంతల మండలం వెల్టూరు గ్రామంలో అలువేలుమంగ సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ధ్వజారోహణతో ప్రారంభించారు. కార్యక్రమంలో బాలరాజు, రంగారెడ్డి, భాస్కర్, జంగయ్య, వేణుగోపాల్‌రెడ్డి, లింగమయ్య, మల్లయ్య, జైపాల్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, బాలరాజు, జంగరావు, రాజు, నిరంజన్, మోహన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డిఉన్నారు.

సామూహిక కుంకుమార్చన

కందనూలు : నాగర్‌కర్నూల్ పట్టణ సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గర జ్ఞానసరస్వతి దేవాలయం 14వ వార్షిక వేడుకలు మంగళవారం ముగిసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకారపు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం మహిళా భక్తులచే ప్రత్యేకంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు పి.నవీన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, దొడ్ల ఇందుమతి, వరలక్ష్మీ, నారాయణరెడ్డి, మాధవి, బాలకృష్ణ, బాలస్వామి, రవి, మహిళలు పాల్గొన్నారు.


కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళా భక్తులు

పన్ను మినహాయింపు చారిత్రాత్మక నిర్ణయం

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్


అచ్చంపేటలో ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అచ్చంపేటటౌన్/ అమ్రాబాద్/ ఊర్కొండ/ పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు పన్ను మినహాయింపు ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ అచ్చంపేట పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగకరంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తూ మంగళ వారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూ1.5 లక్షల కోట్లు వడ్డీలేని రుణ పథకంతో పాటు అర్బన్ చాలెంజ్ నిధుల కోసం పది వేల కోట్లు విడుదల చేసిందన్నారు. తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్లకోసం రూ.19,794 కోట్లు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంగ్యానాయక్, బాలాజీ, బల్మూరి జానకి, రేణయ్య, రవీందర్, తేజస్విని, శివచంద్ర గౌడ్ పాల్గొన్నారు.

- అమ్రాబాద్ : మండల కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహం దగ్గర బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోలిరాజు, నాయకులు శంకర్‌గౌడ్, శ్రీనివాస్, సతీష్, ఉన్నారు.

- ఊర్కొండ : కేంద్ర బడ్జెట్ బలహీన వర్గాలు, రైతులకు, చిరు వ్యాపారులకు ఊరట నిచ్చిందని పేర్కొంటూ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, పరశురాములు, వెంకట్ ఉన్నారు.

- పెద్దకొత్తపల్లి : కేంద్ర బడ్జెట్‌పై సంతోషం వ్యక్తం చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబరు గువ్వల వెంకటయ్య, జిల్లా కార్యదర్శి తిరుమల్‌యాదవ్, నాయకులు కోట్ల సుధాకర్ రావు, శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ అమ్మపల్లి మల్లేష్, శేఖర్, పిల్లి నాగరాజు, పెబ్బేటి రాజశేఖర్, కృపేందర్, విజయ్, గోప్యనాయక్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వెంటనే సవరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం అనుబంధ ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ వ్యవసాయ రంగానికి గతంలో కంటే పదివేల కోట్లు తగ్గించారని, ఆహార భద్రత పథకానికి కేటాయించిన నిధులను చూస్తే దానిని రద్దు చేసేలా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి జి.లక్ష్మణ్, వి.వెంకటేష్, రామయ్య పాల్గొన్నారు.

కార్మిక, కర్షకులపై చిన్న చూపు

తెలకపల్లి : పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నిధులు కేటాయించడంలో కార్మిక కర్షకులపై చిన్న చూపు చూస్తుందని తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు చిటికెల రామకృష్ణ అన్నారు. రాష్ట్ర పభుత్వం లేబర్ ఇన్సూరెన్స్ కార్డుల కోసమే దరఖాస్తు చేసుకున్న కార్డులు ఇవ్వడం లేదని అదేవిధంగా గత సంవత్సరం జరిగిన ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు పెళ్లికానుక ఇస్తానన్న డబ్బులు నేటికీ ఇవ్వలేదని ప్రస్తుత బడ్జెట్‌లో కూడా కార్మికులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదని కానీ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ భారీగా నిధులు ఇచ్చామని బీజేపీ గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొంగరి కాశన్న, దాసరి బాలస్వామి, వేముల తిరుపతయ్య, పాల్గొన్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు వెళ్లిన చెంచు మహిళ

- రాష్ట్రపతితో భేటీ అయి వచ్చిన రేవతికి ఘన స్వాగతం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అభివాదం చేస్తున్న కాట్రాజు రేవతి ఎడమ నుంచి మొదటి

మన్ననూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జనవరి 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు వెళ్లిన కొండనాగుల గ్రామానికి చెందిన కాట్రాజు రేవతి అనే చెంచు మహిళ మంగళవారం తిరిగి రావడంతో మన్ననూరు ఐటీడీఏ కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రపతి భవనంలో జరిగే గణతంత్ర వేడుకలకు మన్ననూరు ఐటీడీఏ నుంచి తెలంగాణ రాష్ట్రం తరఫున కాట్రాజు రేవతి జనవరి 22న విమానంలో వెళ్లింది. రాష్ట్రపతి భవనంలోనే విడిది పొందిన రేవతి రాష్ట్రపతితో పాటుగా ఢిల్లీ ముఖ్యమంత్రిని సైతం కలిసి నల్లమల ప్రాంతంలోని ఆదివాసీల జీవన విధానం, సమస్యలను వివరించినట్లు మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో పీఓ రోహిత్ గోపిడి, కార్యాలయ సిబ్బందితో తన అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్రపతి పర్యటనకు తనను ఢిల్లీ పంపించినందుకు జిల్లా అధికారులకు రేవతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నికల సామగ్రికి టెండర్లు ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ సామగ్రి సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 6న సాయంత్రం 5 గంటల లోగా జిల్లా పరిషత్తు కార్యాలయంలో మూడు సెట్ల టెండరు దరఖాస్తు సమర్పించాలని ఆయన సూచించారు.

గ్రానైట్ ముడిరాయి లారీ పట్టివేత

కల్వకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ నుంచి ముడిరాయిని కర్నూల్‌కు తరలిస్తున్న లారీని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గుర్తించి స్వాధీనపర్చుకున్నారు. ముడి సరుకుకు సంబంధించిన బిల్లులు పరిశీలించగా లారీపై తరలిస్తున్న ముడి రాయి బిల్లు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి మైనింగ్ అధికారులకు సమాచారమిచ్చారు. మంగళవారం రియాల్టీ ఇన్‌స్పెక్టర్ నాగచైతన్య గ్రానైట్ ముడిరాయి కొలతలను వేసి రూ.80వేలు ఫైన్ వేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యానిమల్ బర్త్‌కేర్ సెంటర్ పరిశీలన

కల్వకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణ ప్రజలకు వీధి కుక్కల బెడదను తగ్గించేందుకు పట్టణ పరిధిలోని కురిమిద్ద రోడ్డులో పురపాలక సంఘం స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న యానిమల్ బర్త్‌కేర్ సెంటర్ నిర్మాణం పనులను మంగళవారం పుర కమిషనర్ మహమూద్ పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ షబ్బీర్ అహ్మద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

లింగాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో గల అంబటిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పాఠశాలలో విద్యార్థిలను అభినందించారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కటాస్ విభాగంలో అంబటిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని మహేశ్వరి తమ ప్రావీణ్యాన్ని కనబరచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. 6వ తరగతి విద్యార్థిని భార్గవి వెండి పతకాన్ని సాధించింది. వారిని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరాణి అభినందించారు. విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పీఈటీ నరేందర్, గ్రాండ్ మాస్టర్ సందీప్, మాస్టర్ ముఖేష్ ఆకాంక్షించారు.

ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు జన్మదిన వేడుకలు


పెద్దకొత్తపల్లి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు పరశురాముడు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు జన్మ దినం సందర్భంగా మంగళవారం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని పెద్దకొత్తపల్లి బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల శివ, జిల్లా కౌన్సిల్ మెంబరు గువ్వలి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి తిరుమల్ యాదవ్, నాయకులు కోట్ల సుధాకర్‌రావు, శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ అమ్మపల్లి మల్లేష్, మార్కండేయ, శేఖర్, నాగరాజు, పెబ్బేటి రాజశేఖర్, కృపేందర్, విజయ్, గోప్యనాయక్, పెబ్బేటి లింగస్వామి, పూజారి చంద్రశేఖర్, అమ్మపల్లి రాజు, భాస్కర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి : మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలే భరత్‌చంద్ర, మండల నాయకులు ప్రసాద్, ఖలీల్, కంటే వెంకటస్వామి, రాజు, కృష్ణయ్య, శివ పాల్గొన్నారు.

ఏడున విద్యార్థులకు ప్రేరణ సదస్సు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7వ తేదీన కొల్లాపూర్ పట్టణంలో మినీ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువతలో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తెలిపారు. మండలంలోని పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, దేవునితిర్మలాపూర్, వెన్నచెర్లలోని ప్రభుత్వ కళాశాల, గురుకుల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ఆయన విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఎంవీఎస్ కశ్యప్ చేత ప్రేరణ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా విద్యాధికారులు, రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టు జూపల్లి అరుణ్‌కుమార్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



బిజినేపల్లి చౌరస్తాలో పాదయాత్రగా వెళ్తున్న వినయ్‌కి సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకుడు కరిగళ్ల సుదర్శన్ కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం మంద కృష్ణ మాదిగ తలపెట్టిన లక్షల డప్పులు, వేల గొంతుకల సాంస్కృతిక సభవాల్ పోస్టర్‌ను విడదల చేసి మాట్లాడారు. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశానికి నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లి గ్రామానికి చెందిన వినయ్ పాదయాత్రగా హైదరాబాద్‌కు వెళ్తుండగా బిజినేపల్లిలో ఆయనకు స్వాగతం కలిపారు. నాయకులు సుదర్శన్‌తోపాటు కరికళ్ల దశరథం, బీఎస్పీ మండల అధ్యక్షుడు పానుగంటి రామచందర్, బంగారయ్య, నరసింహ, మహేష్, కళాకారులు విజయ్ కాంత్, డప్పు లక్ష్మణ్, శివకుమార్ ఉన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

కొల్లాపూర్ : మండలం పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో దళిత కాలనీలో శ్మశాన వాటికకు సమీపాన ఉన్న నివాస గృహ పరిసరాల్లో రెండు విద్యుత్ స్తంభాలు నాటి రెండున్నర సంవత్సరాలు గడిచినా నేటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డి.కుమార్ మాదిగ ఆరోపించారు. ఆయన విలేకరులతో మాట్లాడారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రమేష్‌బాబు

కల్వకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తే ఉజ్వల భవిషత్తు సాధ్యమవుతుందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ జూలూరు రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ఆటలపోటీలు నిర్వహించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో బహుమతి ప్రదానం జరిగింది. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. 150 మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కల్మచర్ల రమేష్, లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ కిషన్, సభ్యులు గణేష్, రవిగౌడ్, ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన పాల్గొన్నారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి

- మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచ జడ్పీహెచ్‌ఎస్‌లో చదివే పదవ తరగతి 66మంది మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ నరేందర్‌రెడ్డి 25వేల విలువైన స్టడీ మెటీరియల్ మాజీ ఎంపీపీతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థులు పోటీ పడుతూ చదివి ర్యాంకులు సాధించిన వారికి సింగిల్ విండో డైరెక్టర్ ద్వారా నగదు బహుమతి అందజేస్తారని ప్రకటించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం నరసింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌ఆచారి, జంగయ్య, మోహన్‌రెడ్డి, కృష్ణ, వెంకటయ్య, ముక్తార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి రూ.కోటీ 17 లక్షలు మంజూరు

- మాజీ జడ్పీటీసీ సభ్యుడు హనుమంత్

కొల్లాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం సీఆర్ఆర్ నిధుల నుంచి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కోటి 17 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని మాజీ జడ్పీటీసీ హనుమంత్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని, ప్రధానంగా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించి ప్రజా సమస్యలను తీర్చనున్నట్లు వెల్లడించారు.

మరో ఎంపీటీసీ స్థానం కోసం ఎంపీడీవోకు వినతి

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామానికి అదనంగా రెండవ ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఆ గ్రామ శాఖ ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లి ఎంపీడీవో నాగేంద్రానికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. మండలంలో అత్యధిక జనాభా కలిగిన గ్రామాల్లో పెద్దకార్పాముల ఒకటని, ఈ గ్రామంలో 5వేలకు పైచిలుకు జనాభా, 4వేలకు పైగా ఓటర్లను కలిగిన గ్రామపంచాయతీకి కేవలం ఒక ఎంపీటీసీ స్థానమే ఉందని వారు పేర్కొన్నారు. పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకొని గ్రామానికి అదనంగా మరో ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా మండల ఉపాధ్యక్షుడు గుండాల శివ, ఓబీసీ మోర్చా మండల ఉపాధ్యక్షుడు బంటుపల్లి శివ, బీజేవైఎం నాగర్‌కర్నూల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకల శివ తదితరులు పాల్గొన్నారు.